సాక్షి ఖమ్మం

సోమవారం। 30। జూన్। 2025



మార్కెట్‌లో సౌర వెలుగులు..

ఖమ్మం వీడీవోస్ కాలనీ, బస్టాండ్ పక్కన గల రైతు బజార్లలో సౌర విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. 8లో



ఫాసిస్టు పోకడలతో ప్రమాదం

కేంద్ర ప్రభుత్వం నయా ఫాసిస్టు పోకడలతో పాలన సాగిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

సాయి మందిరాల్లో 11 రోజుల పాటు అభిషేకాలు, హోమాలు



వేడుకలకు ముస్తాబైన శ్రీ షిర్డీ సాయినాథుడు

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా సాయిబాబా మందిరాల్లో 11రోజుల పాటు అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పంచమి నుంచి పౌర్ణమి వరకు ఈ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. వేడుకల్లో భాగంగా గురువులను, పెద్దలను పూజించే రోజును గురుపూర్ణిమ లేదా వ్యాస పూర్ణిమ అంటారు. వేద వ్యాసుడిని మానవులంతా గురువుగా భావిస్తారు. గురుపౌర్ణమి రోజున ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. మరి కొందరు సత్యనారాయణ స్వామి వ్రతాలు కూడా ఆచరిస్తారు. ఈ వేడుకల కోసం ఖమ్మం నగరంలోని రంగనాయకుల గుట్ట పక్కన గల శ్రీకృష్ణ సాయి ఆశ్రమం, గాంధీచౌక్‌లోని షిర్డీసాయి మందిరంతో పాటు జిల్లాలోని పలు సాయిబాబా ఆలయాలు, మందిరాల్లో ఏర్పాట్లు చేశారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఖమ్మం సహకారనగర్ : విద్యారంగ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.అనిల్‌కుమార్ అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 20శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీల తర్వాతే పదోన్నతులు చేపట్టాలన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను స్థాపించి ప్రభుత్వ పాఠశాలలను మూసివేసేందుకు సర్కారు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. టీపీటీఎఫ్ నేతలు నాగిరెడ్డి, మనోహర్ రాజు, విజయ్, పద్మ మాట్లాడుతూ.. కేజీబీవీ ఉద్యోగులకు మొదటి తారీఖునే వేతనాలు చెల్లించాలని, వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. కేజీబీవీల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వి. నాగేశ్వరరావు, వెంగళరావు, నాయకులు రమాదేవి, ముత్తయ్య, వెంకటేశ్వరరావు, వీరబాబు పాల్గొన్నారు.

అమ్మవారికి విశేష పూజలు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా భక్తులు దర్శించుకుని అమ్మవారికి ఒడిబియ్యం, తలనీలాలు, చీరలు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించగా, భక్తులు బోనాలు, సారె సమర్పించారు. ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయకమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

క్షీర ధారలు!



మార్కెట్లో అన్ని ఆహార పదార్థాల్లో కల్తీ జరుగుతోంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ అవసరమయ్యే పాలు కూడా కల్తీ కావడం ఆందోళన కలిగిస్తోంది. స్వచ్ఛమైన పాలను తలపించేలా కల్తీ పాలు కూడా మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఈ పాలతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుండగా.. మధిర నియోజకవర్గంలో పాల ఉత్పత్తిని పెంచాలని 2013లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ మల్లు భట్టి విక్రమార్క ఆలోచన చేశారు. అప్పుడే ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఐకేపీ మహిళా సభ్యుల ఆర్థిక స్వావలంబన కోసం అడుగులు వేశారు. డీఆర్‌డీఏ – ఐకేపీ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘ సభ్యులతో ఇందిరా మహిళా డెయిరీ పథకానికి శ్రీకారం చుట్టారు. – మధిర

- మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ఇందిరా డెయిరీ
- త్వరలోనే 20వేల మంది సభ్యులకు 40వేల గేదెలు పంపిణీ
- ప్రాజెక్టుపై నిత్యం సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి





ఇందిరా మహిళా డెయిరీ లోగో ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క (ఫైల్)

ప్రాజెక్టుకు రూపకల్పన..

మధిర నియోజకవర్గంలో పూర్తి వ్యవసాయ ఆధారిత భూమి ఉంది. వ్యవసాయ రంగానికి అనుసంధానంగా పాడి పరిశ్రమ ఏర్పాటు చేసి మహిళా సంఘాల సభ్యులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ఐదు మండలాల్లో 2013లో 4వేల మందితో సభ్యత్వం కట్టించి సహకార సంఘ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించారు. ఒక్కో మండలం నుంచి 4 వేల మంది చొప్పున 20 వేల మందితో సభ్యత్వం కట్టించగా, ప్రస్తుతం బ్యాంకులో రూ.3.75 కోట్లు ఇందిరా మహిళా డెయిరీ ఖాతాల్లో ఉన్నాయి. తర్వాత తెలంగాణ ఏర్పడ్డాక పదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో లేకపోవడంతో ఈ పనులు నిలిచిపోయాయి. తిరిగి 2024లో ప్రభుత్వం ఏర్పాటుతో డెయిరీ పనుల్లో వేగం పెంచారు. నియోజకవర్గంలో 20 వేల మందితో సభ్యత్వం కట్టించడంతోపాటు ఐదు మండలాల్లో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు (పాలశీతలీకరణ కేంద్రాలు) ఏర్పాటు చేయించారు. ఎర్రుపాలెం మండలంలో గతేడాది విజయదశమి రోజున బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ (బీఎంసీయూ)లను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభించగా పాలు సేకరిస్తున్నారు.

బోనకల్‌లో రీ సైక్లింగ్..

ఐదు మండలాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా వచ్చిన పాలతో బోనకల్ మండలంలో 9.24ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయనున్న ఇందిరా మహిళా డెయిరీ మదర్ యూనిట్ ద్వారా పాలను రీసైక్లింగ్ చేస్తారు. వాటి ద్వారా పాల ఉత్పత్తులైన వెన్న, మజ్జిగ, పాలకోవా, పాల ప్యాకెట్లు తదితర ఉత్పత్తులను తయారు చేస్తారు. వీటితో వచ్చే ఆదాయాన్ని సంఘ సభ్యులకు బోనస్ రూపంలో చెల్లిస్తారు. ఈ ప్రాజెక్టును డిప్యూటీ సీఎం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ శరవేగంగా పనులు సాగిస్తున్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఈ ప్రాజెక్టు అమలుకు ఐకేపీ – డీఆర్డీఏ, పశు సంవర్ధక, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖలతో కలెక్టర్, డీఆర్డీఓ సమన్వయం చేస్తున్నారు.

డెయిరీ ముఖ్య ఉద్దేశాలు..

- మధిర నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాల నుంచి 20వేల మంది సభ్యులకు ఒక్కొక్కరికి రెండు పాడి గేదెలు ఇవ్వాలి.
- ఒక్కో సభ్యురాలికి 80 శాతం సబ్సిడీ అంటే రూ.1.60 లక్షలు ప్రభుత్వం నుంచి సహకారం అందుతుంది.
- అన్ని గ్రామాల్లో ఇందిరా డెయిరీ పాల కేంద్రాలు ఏర్పాటు చేసి పాలు సేకరించాలి.

చేపట్టాల్సిన పనులు..

- మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల్లో ఏర్పాటు చేసిన బీఎంసీయూలు ఎర్రుపాలెం మినహా 4 మండలాల్లో ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలి.
- ఈ ప్రాజెక్టు విజయవంతానికి ప్రత్యేకంగా జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షణ ఉండాలి.
- పాల కేంద్రాలు ప్రారంభించి వారికి తగిన సామగ్రి అందించాలి.
- సంఘ సభ్యులకు పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలి
- మండలాన్ని 5 క్లస్టర్లుగా విభజించి సుమారు 40 మంది నిరుద్యోగులతో గడ్డి పెంపకం కేంద్రాలు ఏర్పాటు చేసి పశు గ్రాసం కొరత లేకుండా చూడాలి.
- గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశం లభిస్తుంది.

గుజరాత్, ములకనూరులో అధ్యయనం



నియోజకవర్గంలోని ప్రతి మహిళను అభివృద్ధి చేసేందుకు భట్టి విక్రమార్క 2013లో ఇందిరా మహిళా డెయిరీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సంస్థ నిర్వహణ కూడా మహిళలకే అప్పగించారు. గుజరాత్ లోని అముల్, తెలంగాణలోని ములకనూరు డెయిరీలను సందర్శించాం. వచ్చే నెలలో అన్ని సామాజిక వర్గాల మహిళలకు పాడి గేదెలు పంపిణీ చేస్తారు. – కంటిపూడి అన్నపూర్ణ, అధ్యక్షురాలు, ఇందిరా మహిళా డెయిరీ

భట్టి విక్రమార్క చొరవతోనే..



2013లో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. డెయిరీ ప్రాజెక్టులో 20వేల మంది మహిళలు సభ్యులుగా చేరారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ పథకం నిలిచిపోయింది. భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం అయ్యాక తిరిగి వేగం పుంజుకుంది. ఈ ప్రాజెక్టుతో మహిళలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

– బండెల లలిత కుమారి, కోశాధికారి, ఇందిరా మహిళా డెయిరీ

80 శాతం సబ్సిడీ..



ఒక్కొక్కరికి రెండు గేదెల చొప్పున రూ.2 లక్షలకు గాను 80శాతం సబ్సిడీ ఉంటుంది. మిగిలిన 20 శాతం కూడా బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. 4 మండలాల్లో బీఎంసీ యూ ఏర్పాటుకు రూ. 2 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పిలిచారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నియోజకవర్గంలో పాల దిగుబడి పెరుగుతుంది.

– ఏడుకొండలు, ఇందిరా మహిళా డెయిరీ, ఇన్‌చార్జ్ పర్సన్

ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం సహకారనగర్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోనకల్ మండలంలోని కలకోట, బ్రాహ్మణపల్లి, రాయన్నపేట, ముదిగొండ మండలం గంధసిరి, గంగాపురం, పెద్ద మండవ, చింతకాని మండలంలో చిన్న మండవ, మధిర మండలంలో ఖమ్మంపాడు, చిలుకూరు, నక్కలగరుబు, ఎర్రుపాలెం మండలంలో తక్కెళ్లపాడు, ఇనగాలి, చొప్పకట్లపాలెం, తిరుమలాయపాలెం మండలంలోని ముజాహిద్‌పురం, హైదర్‌సాయిపేట, కూసుమంచి మండలంలో జక్కేపల్లి, తల్లాడ మండలంలో గొల్లగూడెం, వైరా మండలంలో ఖానాపురం, విప్పలమడక వద్ద ఇసుక రీచ్‌లను గుర్తించామని వివరించారు. ఎలాంటి సీనరేజీ చార్జీలు లేకుండా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ఉచితంగా సరఫరా చేస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారుల వివరాలు, ఇంటి నిర్మాణ స్థలం, అవసరమైన ఇసుక వివరాలతో ఆయా మండలాల హౌసింగ్ ఏఈలు తహసీల్దార్లకు ప్రతిపాదనలు అందిస్తారని, వాటి ఆధారంగా తహసీల్దార్లు కూపన్లు జారీ చేస్తారని తెలిపారు. లబ్ధిదారులకు అందించే కూపన్ మూడు రోజుల వరకు చెల్లుబాటు అవుతుందని పేర్కొన్నారు. ఆ కూపన్ ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ వే బిల్లు జారీ చేస్తారని, లబ్ధిదారులు జిల్లాలోని ఏ ఇసుక రీచ్ నుంచి అయినా తమకు కేటాయించిన ఇసుక తీసుకెళ్ల వచ్చని తెలిపారు. ఇసుక రీచ్‌ల పర్యవేక్షణ బాధ్యతను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగించామని, ఇసుక లోడ్‌లో ఎలాంటి యంత్రాలను వినియోగించరాదని పేర్కొన్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే ఇసుక తరలించాలని సూచించారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కిన్నెరసానిలో పర్యాటక సందడి

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కిన్నెరసానికి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. రోజంతా సరదాగా గడిపారు. 537 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.29,100 ఆదాయం లభించగా, 250 మంది బోటుషికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.14,060 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అధికారం కోసమే బీజేపీ దైవజపం

- మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సభలో మాట్లాడుతున్న కూనంనేని

నేలకొండపల్లి : అధికారం కోసమే బీజేపీ రామ జపం, దైవ జపం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని మోటాపురంలో ఆదివారం జరిగిన సీపీఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. దేవుడి పేరుతో ప్రజలను వంచిస్తోందని, మతం మాటున ప్రజలను చీల్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఆ పార్టీకి అధికార ధ్యాసే తప్ప దేశభక్తి లేదన్నారు. దేశం కోసం బీజేపీ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల అభ్యున్నతి, హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, త్యాగాల చరిత్ర తమ సొంతమని అన్నారు. కార్పొరేట్ల కోసమే పనిచేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సంపద సృష్టి కోసం కొత్త మార్గాలు అన్వేషించాలని ప్రభుత్వానికి సూచించారు. మావోయిస్టులను హతమార్చడానికి అమిత్‌షా వంటి వారు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులు జన జీవన స్రవంతిలోకి రావాలని కోరారు. సీపీఐ శత వసంతాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో చారిత్రక సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సభలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు హేమంతరావు, మహ్మద్ మౌలానా, దండి సురేష్, జితేందర్‌రెడ్డి, కర్ణకుమార్, కర్నాటి భానుప్రసాద్, రామ్మూర్తి, మారిశెట్టి వెంకటేశ్వరరావు, పాల్తీయ శ్రీనివాసరావు, రాంకోటి, కాశిబోయిన అయోధ్య, మేకల పుల్లయ్య, మల్లెబోయిన ఉపేందర్, సీతారాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సేకరణలో భేష్..

- ధాన్యం కొనుగోళ్లలో మహిళా సంఘాల సత్తా
- జిల్లాలో 159 కేంద్రాల నిర్వహణ
- రైతుల నుంచి 8,96,528 క్వింటాళ్ల సేకరణ



ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ పరీక్షిస్తున్న మహిళా సంఘం సభ్యురాలు (ఫైల్)

నేలకొండపల్లి: ఏ రంగంలోనైనా.. తమకు తామే సాటి అంటూ మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే ధాన్యం కొనుగోళ్లలో ఐకేపీ మహిళా సంఘాలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో రైతులు పండించిన ధాన్యాన్ని ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు చేయడం, మిల్లులకు తరలించడం వంటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నాయి. రైతులు–మిల్లర్లకు మధ్య సంఘ సభ్యులు వారధిలా నిలుస్తున్నారు. ఇటీవల జిల్లాలో 159 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా.. విజయవంతంగా నిర్వహించారు.

8,96,528 క్వింటాళ్ల ధాన్యం సేకరణ..

జిల్లా వ్యాప్తంగా ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 159 కేంద్రాల ద్వారా 13,990 మంది రైతుల నుంచి 8,96,528 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలోనూ ధైర్యంగా ముందుకు సాగారు. ఇటు రైతులను ఒప్పించి, అటు మిల్లర్లకు సర్దిచెప్పి విజయవంతంగా తరలించారు. వీరికి వచ్చే కమీషన్ కొంచమే అయినా రైతులకు, మిల్లర్లకు మధ్య వారధిగా పనిచేయడం విశేషం. ఇలా ప్రతీ రెండు సీజన్‌లకు కొనుగోలు చేసే సభ్యులు మారుతుండగా.. ప్రతి ఒక్కరికీ ఉపాధి లభించినట్టవుతుంది.

ఉపాధి కలుగుతోంది..



గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో మాకు ఉపాధి కలుగుతోంది. రైతులకు అందుబాటులో ఉంటూ ధాన్యం విక్రయించేందుకు అవసరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకున్నాం. జిల్లా అంతటా ఐకేపీ కేంద్రాలు విజయవంతంగా నిర్వహించాం.

– కె.సంధ్య, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



జిల్లాలోని ఐకేపీ సభ్యులు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రోత్సహించాం. అనుకున్నట్టుగానే సభ్యులు ఆశించిన స్థాయి కంటే ఎక్కువగా విజయం సాధించారు. వ్యాపార రంగంలో కూడా అడుగు పెట్టేందుకు ఇది ఒక శిక్షణ వంటిది. జిల్లాలోని ఐకేపీ సభ్యులు ఆదర్శంగా నిలుస్తున్నారు.

– దర్గయ్య, ఐకేపీ డీపీఎం

మహిళల సేవలు ప్రశంసనీయం



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మహిళా సంఘాల వారు రైతులకు అందించిన సేవలు ప్రశంసనీయం. రైతులకు, అధికారులకు మధ్య వారధిగా నిలిచారు. మహిళల ఆర్థికాభివృద్ధికి కూడా ఇది ఎంతగానో దోహదపడింది. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.

– వేగినాటి లక్ష్మీనర్సయ్య, రైతు, ముజ్జుగూడెం

గోదావరి పుష్కరాలకు ప్రణాళికే కీలకం

- 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు పుష్కరాలు
- కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా
- ఇంకా ప్రణాళిక, నిధులు విడుదల చేయని ప్రభుత్వం



2015 పుష్కరాల్లో భద్రాచలంలో పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులు

భద్రాచలం: భక్తులు మహా పవిత్రంగా భావించే గోదావరి పుష్కరాలకు రెండేళ్ల సమయమే ఉంది. 2027లో జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహించనున్నట్లు షెడ్యూల్ ప్రకటించగా భద్రాచలానికి కోటి మందికి పైగా భక్తులు వస్తారని అధికారుల అంచనా. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యాల కోసం ముందస్తు ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. మహారాష్ట్రలోని నాసిక్ వద్ద నున్న త్రయంబకంలో పుట్టిన గోదావరి నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద తెలంగాణలో ప్రవేశిస్తోంది. ఆదిలాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల మీదుగా భద్రాద్రి జిల్లాలోకి ప్రవేశించి భద్రాచలం దిగువన ఏపీలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ద్వారా అంతర్వేది వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నది 180 కి.మీ.ప్రవహించగా, విభజనం అనంతరం ఏపీలో ఏడు మండలాలు విలీనం కాగా, ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో 70 కి.మీ.ప్రవహిస్తోంది.

2015లో పుష్కరాలు..

గత పుష్కరాలు 2015 జూలై 14 నుంచి 25 వరకు జరిగాయి. మళ్లీ 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహించనున్నారు. బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, పర్ణశాల, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాల్లో భక్తులు పుష్కర స్నానం చేయనున్నారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలానికి అత్యధికంగా తరలివస్తుంటారు. గత పుష్కరాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 70 లక్షల మంది భక్తులు హాజరయ్యారని, 2027లో కోటి మందికి పైగానే భక్తులు పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం, పర్ణశాల, మోతె తదితర ప్రాంతాల్లో తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

ప్రణాళిక ప్రకటించని ప్రభుత్వం

2027లో పుష్కరాలను విజయవంతం చేయాలంటే కనీసం రెండేళ్ల ముందు నుంచే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. స్నానఘాట్ల పెంపు, రోడ్ల వెడల్పు, ఆలయ పరిసర ప్రాంతాల విస్తరణ, భక్తులకు వసతుల కల్పన వంటి పనులు చేపట్టాలి. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ ముందస్తు పనులకు రూ.50కోట్ల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఘాట్ల పెంపు వంటి వసతుల కల్పనకు, శాశ్వత పనులకు ఇంకా నిధులు అవసరమవుతాయి. ఏపీలో ఇప్పటికే ఈ పుష్కరాల పనులపై సమీక్ష, బడ్జెట్‌తో ప్రణాళిక ప్రకటించారు. తెలంగాణలో మాత్రం ఇప్పటివరకు ఏ ప్రకటనా వెలువడ లేదు. దీనిపై ఉమ్మడి జిలా మంత్రులు చొరవ తీసుకుని ప్రణాళిక, నిధులు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

అలరించిన సినీ సంగీత విభావరి



పాట పాడుతున్న గాయకులు

ఖమ్మంగాంధీచౌక్: స్వర సుధా మ్యూజిక్ ఖమ్మం యూనిట్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. యూనిట్ అధ్యక్షుడు కె. మాధవరావు, ఉపాధ్యక్షుడు వి.వి. రెడ్డి, ప్రతినిధులు పీజే వినయ్‌కుమార్, పిన్నెల్లి యాదగిరి, కీర్తన, రేవతి, జనార్దన్, స్వప్న, రాయప్రోలు సుబ్రమణ్యం, ఆర్.మధు చేసిన గానం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమంలో నెల నెలా వెన్నెల నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యం, సామాజిక సేవకులు డాక్టర్ వనం కృష్ణవేణి, పుసులూరి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు పూర్తి



ఎంపికలు నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలకు 70 మంది బాలబాలికలు హాజరయ్యారు. అండర్–14, 12, 10 విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్ అహ్మద్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాన

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి వర్షం కురిసింది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురవగా, కొన్నిచోట్ల తేలికపాటి వాన పడింది. వాతావరణ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం రాత్రి 9 గంటల వరకు ముదిగొండ మండలం పమ్మిలో అత్యధికంగా 38.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. చింతకాని మండలం నాగులవంచలో 35.3, బాణాపురంలో 27.8, నేలకొండపల్లిలో 22.3, మధిరలో 20.5, తిరుమలాయపాలెంలో 18.8, గుబ్బగుర్తిలో 18, ఖమ్మం ఖానాపురంలో 17.3, మధిర ఏఆర్ఎస్ వద్ద 17, చింతకానిలో 16.5, రావినూతలలో 16.3, రఘునాథపాలెంలో 15.3, వైరాలో 15, కూసుమంచిలో 14.5, ఖమ్మం కలెక్టరేట్ వద్ద 14.3, ఖమ్మం ఎన్ఎస్పీ గెస్ట్‌హౌస్ వద్ద 14, పల్లెగూడెంలో 13, లింగాలలో 12, కొణిజర్లలో 11, సిరిపురంలో 10.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ వాన పంటల సాగుకు, ఇప్పటికే సాగులో ఉన్న పత్తి, పెసర వంటి పంటలకు మేలు చేస్తుందని, వరినారు పోసేందుకు కూడా దోహదపడుతుందని రైతులు చెబుతున్నారు.

జూలై 5న కౌన్సెలింగ్



సింగరేణి(కొత్తగూడెం): నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 150 సీట్ల భర్తీ కోసం సింగరేణి కార్మికులు, మాజీ కార్మికుల పిల్లలు ఈ నెల 28 నుంచి 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. సివిల్–30, కంప్యూటర్–30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్–30, మెకానికల్–30, మైనింగ్–30 సీట్లు ఉన్నాయని, https:# scp. scpolytechnic. com/ online& admission వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసి, కాపీని డౌన్‌లోడ్ చేసి, సంబంధిత గని, డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీతో అటెస్టేషన్ చేయించి జూలై 5వ తేదీన జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొంది. వివరాల కోసం 90102 22161, 87901 12515, 94911 44168 నంబర్లలో సంప్రదించాలని సూచించింది.

మార్కెట్‌లో సౌర వెలుగులు..

- ఖమ్మం వీడీవోస్ కాలనీ సమీకృత మార్కెట్‌లో ఏర్పాటుకు ప్రతిపాదన
- 15 కిలోవాట్ల ప్యానళ్లకు రూ.10 లక్షలతో అంచనా
- సౌర విద్యుత్‌తో నిర్వహణ భారం తగ్గే అవకాశం



మార్కెట్ భవనంపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



ఖమ్మం వీడీవోస్ కాలనీలోని సమీకృత రైతు మార్కెట్

ఖమ్మంవ్యవసాయం: సౌర విద్యుత్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్యఘర్ మఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా గృహాలకు ఉచిత విద్యుత్ అందించటం లక్ష్యంగా సబ్సిడీలతో ప్రోత్సహిస్తోంది. రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరగటంతో అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ మార్గమైన సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రోత్సాహం అందిస్తున్నాయి. అవకాశం ఉన్నచోట సౌర ఫలకాల ఏర్పాటుకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికలు, సమీకృత మార్కెట్లు, రైతు బజార్లలో కూడా సౌర విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సూచనలతో ఖమ్మంలోని వీడీవోస్ కాలనీ, బస్టాండ్ పక్కన ఉన్న సమీకృత రైతు బజార్లు, పాత బస్టాండ్ సమీపంలో ఉన్న రైతుబజార్లను మార్కెటింగ్ శాఖ, రెడ్‌–కో అధికారులు సందర్శించారు. ఈ మూడింటిలో వీడీవోస్ కాలనీలో ఉన్న సమీకృత రైతు మార్కెట్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉన్నట్లు రెడ్‌–కో అధికారులు గుర్తించారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

వీడీవోస్ కాలనీ సమీకృత రైతు మార్కెట్ భవనంపై సౌర విద్యుత్ ఫలకాల నిర్మాణానికి అవకాశం ఉన్నట్లు రెడ్‌–కో అధికారులు గుర్తించారు. ఈ భవనంపై 15 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర ఫలకాల ఏర్పాటుకు అవకాశం ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. 15 కిలోవాట్ల సౌర ఫలకాల నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చవుతుందని అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి, రెడ్‌–కో అధికారులు, జిల్లా మార్కెటింగ్ శాఖ ద్వారా ఉన్నతాధికారులకు పంపించనున్నారు. అయితే సమీకృత మార్కెట్లను మున్సిపాలిటీ నిర్మించగా, నిర్వహణను మార్కెటింగ్ శాఖ చూస్తోంది. దీంతో సౌర విద్యుత్‌కు ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే నిధులను ఏ శాఖ భరిస్తుందనేది తేల్చాల్సి ఉంటుంది.

తగ్గనున్న నిర్వహణ భారం

సౌరవిద్యుత్ ఉత్పత్తితో సమీకృత మార్కెట్ నిర్వహణ భారానికి కొంత వెసులుబాటు కలిగే అవకాశం ఉంది. ఇప్పటికే వినియోగదారుల ఆదరణకు నోచుకోకుండా అంతంతమాత్రంగా నిర్వహణ సాగిస్తున్నాయి. విద్యుత్ భారం అదనం. ఇప్పటికే మూతపడి ఉన్న నాన్‌వెజ్ మార్కెట్‌లో సేంద్రియ రైతు మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ప్రస్తుత కూరగాయలు, ఆకుకూరల విక్రయాలతో పాటు సేంద్రియ రైతు మార్కెట్ నిర్వహణలోకి వస్తే సౌర విద్యుత్ ఉత్పత్తి కొంత మేరకు తోడ్పాటునిచ్చే అవకాశం ఉంది. ఈ మార్కెట్‌కు విద్యుత్ బిల్లుల భారం తగ్గే అవకాశం ఉంది.

అనుమతులు రాగానే పనులు



ప్రభుత్వం అనుమతులు ఇస్తే వీడీవోస్ కాలనీ సమీకృత రైతు మార్కెట్ భవనంపై సౌర విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకుంటాం. ఈ భవనంపై 15 కిలోవాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన ఫలకాలను అమర్చే అవకాశం ఉంది. ఈ మార్కెట్ భవనంపై సౌర విద్యుత్ ఉత్పత్తికి వనరులు కూడా అనుకూలంగా ఉన్నాయి.

–పి.అజయ్‌కుమార్, మేనేజర్, రెడ్‌–కో, ఉమ్మడి ఖమ్మం జిల్లా

నయా ఫాసిస్టు పోకడలతో ప్రమాదకరం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నయా ఫాసిస్టు పోకడలతో కూడిన పాలన కొనసాగిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నరేంద్రమోదీ 11 ఏళ్ల పరిపాలనలో కార్పొరేట్ సంస్థలకు లబ్ధి జరిగేలా నిర్ణయాలు జరిగాయని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలు, గ్రామీణ రైతాంగం, పట్టణ కార్మిక వర్గాలు ఆశించిన అభివృద్ధిని సాధించలేదని, దేశంలో ద్రవ్యోల్బణం పెరిగి నిరుద్యోగం తారాస్థాయికి చేరిందని, ప్రజల కొనుగోలు శక్తి హీన స్థాయికి దిగజారిందని పేర్కొన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి వేగం పుంజుకున్నప్పుడు దేశంలో, సేవారంగంలో సైతం అభివృద్ధి కనబడుతుందని చెప్పారు. లౌకిక, సామ్యవాద స్ఫూర్తికి నిలువుటద్దంగా నిలిచిన భారత రాజ్యాంగాన్ని సైతం నిర్వీర్యం చేయడానికి బీజేపీ పూనుకుంటోందని విమర్శించారు. తన మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల ద్వారా నయా ఫాసిస్ట్ పోకడలతో కూడిన చర్యలను చేపడుతోందని, ప్రజలు గమనించాలని తమ్మినేని కోరారు. సమావేశంలో నున్నా నాగేశ్వరరావు, ఎం.సుబ్బారావు, పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో తత్కాల్ లేదు..

- స్టేషన్‌లో బుక్ చేసుకోవాల్సిందే..
- రేపటి నుంచి రైల్వేస్టేషన్‌లో కౌంటర్ ప్రారంభం

ఖమ్మంరాపర్తినగర్: రైళ్లలో ప్రయాణించే వారు ఒక్కరోజు ముందుగా తీసుకునే తత్కాల్ టికెట్‌ను సమీప రైల్వేస్టేషన్‌కు వచ్చి తీసుకోవాల్సిందే. ఇకపై ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే వెసులుబాటును రైల్వే శాఖ తొలగించింది. జూలై 1వ తేదీ నుంచి అమలు జరిపే విధంగా రైల్వే శాఖ చర్యలు తీసుకోవడంతో ప్రయాణికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు అధిక శాతం మంది తత్కాల్ టికెట్ కావాలంటే సమీపంలోని రైల్వే ఏజెంట్, లేదా ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉంది. కానీ, తాజా నిర్ణయంతో తత్కాల్ టికెట్ కావాల్సిన ప్రతీ ఒక్కరు రైల్వే స్టేషన్‌కు రావాల్సిందేనని అధికారులు అంటున్నారు. ఈ ప్రక్రియతో ఏజెంట్లు, ఆన్‌లైన్ ద్వారా చేసుకునే వారికి ఇబ్బందిగా పరిణమించింది.

ఆధార్, మొబైల్ నంబర్‌తో ఓటీపీ

తత్కాల్ బుక్ చేసుకునే వారు సమీప రైల్వే స్టేషన్‌కు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ తీసుకెళ్లాల్సి ఉంటుంది. ముందుగా పేరు నమోదు చేసి, ఆధార్, మొబైల్ నంబర్ అడుగుతారు. ఓటీపీ రాగానే టికెట్ పొందవచ్చు. ఏదైనా ప్రమాదం జరిగితే ఇదే నంబర్‌కు మెసేజ్ వస్తుంది. కాగా, తత్కాల్ టికెట్లు ఇబ్బడిముబ్బడిగా ఏజెంట్ల ద్వారా అయిపోతున్నాయనే కారణంతో దీనిని రైల్వే శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది.

గోదావరికి జలకళ



భద్రాచలం వద్ద గోదావరి పరవళ్లు

భద్రాచలంటౌన్: కొత్తనీరు రావడంతో భద్రాచలం వద్ద గోదావరి జలకళ సంతరించుకుంది. గతవారం వరకు ఏడారిని తలపించిన నదిలో ఇటీవల కురిసిన వర్షాలకు కొత్త నీరు ప్రవహిస్తోంది. వారం రోజులుగా సరిహద్దు రాష్ట్రాల్లో వర్షాలు భారీగా కురుస్తుండటంతో ఎగువన ఉన్న ప్రాజెక్టులకు వరద నీరు చేరుతుండటంతో, అక్కడి నుంచి దిగువకు వదులుతుండగా గోదావరిలో వరద నీరు పెరుగుతోంది. గోదావరిలో జలప్రవాహంతో కరకట్టపై సందర్శకులతో సందడి నెలకొంది.

ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలి

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాష్ట్ర మంత్రి తుమ్మల వినతి



అమిత్ షాకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న మంత్రి తుమ్మల

భద్రాచలం: పునర్విభజనలో భాగంగా ఏపీలో కలిసిన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్‌లో పసుపుబోర్డు ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఏపీలో కలిపిన భద్రాచలం చుట్టుపక్కల గ్రామాలైన ఎటపాక, కన్నాయిగూడం, పిచుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నంలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కోరారు. వీటివల్ల పరిపాలనా, అభివృద్ధి పనుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. భద్రాచలం పట్టణం, తెలంగాణ ప్రధాన మండలాల మధ్య రవాణా అంతరాయం ఏర్పడుతోందని, భద్రాచలంలోని విద్యాసంస్థల్లో చదివే గిరిజన విద్యార్థులకు రాకపోకల్లో రెండు రాష్ట్రాల చెక్‌పోస్టుల వల్ల గిరిజనులు, వాణిజ్య వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు.

గేటెడ్ కమ్యూనిటీల్లో ప్లాట్లు నిర్మించాలి

టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలో గెజిటెడ్ అధికారుల కోసం గేటెడ్ కమ్యూనిటీలా ప్లాట్లు నిర్మించాలని టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. టీజీఓ భవనంలో ఆదివారం జరిగిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల హౌస్ బిల్డింగ్ సొసైటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలోని రాజీవ్ స్వగృహ ప్లాట్లు 576 ఉన్నాయని, సొసైటీలో 975 మంది సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న వారు జూలై 10 లోపు ఎన్ఎస్‌టీ రోడ్డులోని ఎస్‌బీఐలో రూ. 2లక్షలు డిపాజిట్ చేయాలని, అలా చేసిన వారిలో 576 మందికి ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని అన్నారు. అంతకంటే ఎక్కువ మంది డిపాజిట్ చేస్తే లాటరీ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో టీజీఓస్ జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్‌జీఓస్ జేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, వాసిరెడ్డి శ్రీనివాస్, కొండపల్లి శేషుకుమార్, రమేష్, మహేష్‌బాబు, సుధారాణి, డాక్టర్ సంజయ్, గంగవరపు బాలకృష్ణ, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్ట్

ఖమ్మంక్రైం: నగరంలో గంజాయి విక్రయించేందుకు వచ్చిన ములుగు జిల్లావాసులు ముగ్గురిని త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ములుగు జిల్లాకు చెందిన కుర్రా మోహన్, బోడ మురారి, బోడ గౌతమ్ శ్రీనివాసనగర్‌లోని కాల్వకట్ట ప్రాంతంలో ఉంటున్నారు. వారు గంజాయివిక్రయంతోపాటు సేవించటానికి అలవాటు పడి ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన వినోద్‌కుమార్, జాడి రాకేశ్ వద్ద గంజాయి కొనుగోలు చేసి ఖమ్మం తీసుకొచ్చారు. చర్చికాంపౌండ్ బ్రిడ్జి కింద ఎస్‌ఐ కొండల్‌రావు తనిఖీలు చేపడుతుండగా వారు ద్విచక్రవాహనంపై వెళ్తూ పట్టుబడ్డారు. వారి వద్ద 1,100 గ్రాముల గంజాయి లభ్యమైంది. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

యూరియా తిని 11 మేకల మృతి



మృతి చెందిన మేకలు

ములకలపల్లి: యూరియా తినడంతో 11 మేకలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని మంగపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మంగపేట గ్రామానికి చెందిన వాడె దారయ్యకు చెందిన మేకలు గ్రామశివారు లో మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో ఓ రైతు ట్రాక్టర్‌లో యూరియా బస్తాలు తరలిస్తుండగా ఒకటి రోడ్డుపై పడటంతో యూరియా కిందపడింది. సమీపంలో ఉన్న 11 మేకలు యూరియా తిని మృతిచెందాయి. సుమారు రూ.1.5 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

కాల్వలోకి దూసుకెళ్లిన లారీ



రిజర్వాయర్ కాల్వలో పడిపోయిన లారీ

వైరా: వైరా వైపు నుంచి జగ్గయ్యపేట వెళ్తున్న ఓ లారీ ఆదివారం అదుపుతప్పి రిజర్వాయర్ ఎడమ కాల్వలో పడింది. గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు జరుగుతున్న సోమవరం ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్ వద్ద లారీడ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న మరో లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న రిజర్వాయర్ ఎడమ కాల్వలోకి దూసుకెళ్లింది. లారీడ్రైవర్‌కు స్వల్ప గాయాలతో బయటపడటంతో ప్రమాదం తప్పినట్లయింది.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకా.. మండలంలోని మోటాపురం గ్రామానికి చెందిన రాజేశ్ (24) ఆదివారం అధికంగా టాబ్లెట్లు వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి.. ఖమ్మం తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

నగరవాసిపై పీడీ యాక్ట్ కేసు

ఖమ్మంఅర్బన్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడన్న ఆరోపణలపై పగడాల విజయ్ అలియాస్ చంటిపై పోలీస్ శాఖ పీడీ యాక్ట్‌ను ప్రయోగించింది. ఖమ్మంఅర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విజయ్ పలు నేరాలకు పాల్పడినందున ఈ చర్య తీసుకున్నట్లు సీపీ ఎస్.సునీల్‌దత్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. నగరంలోని అగ్రహారం న్యూ కాలనీకి చెందిన పగడాల విజయ్ కొంతకాలంగా హత్యాయత్నం, దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపు లు, గుండాగిరి కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నా డు. పలుమార్లు పోలీసులు అరెస్టు చేసినప్పటికీ జామీన్‌పై విడుదలై మళ్లీ అదేతరహా నేరాలకు పాల్పడుతూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో విజయ్‌ను అదుపులోకి తీసుకుని, ఖానాపురం హవేలి (ఖమ్మంఅర్బన్) పోలీస్‌స్టేషన్ సీఐ భానుప్రకాష్ నేతృత్వంలో హైదరాబాద్ చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించామని కమిషనర్ వివరించారు.

గంజాయి పట్టివేత

పాల్వంచ: కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ సతీశ్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం స్థానిక రెజీనా కాన్వెంట్ సమీపంలో ఎస్‌ఐ సుమన్ వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన కారు ను ఆపేందుకు యత్నించగా.. అందులో నుంచి ముగ్గురు వ్యక్తులు పారిపోయారు. మరో ముగ్గురితోపాటు 11.100 కేజీల గంజాయి పట్టుబడింది. వారు చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన కందిమళ్ల శ్రీహరి, జొన్నలగడ్డ రాకేశ్‌రెడ్డి, బోనకల్ మండలం ముష్టికుంట్లవాసి ఎస్‌కే జావిద్‌గా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం..

కల్లూరు: మండలంలోని చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన కారుకుల నరసింహారావు, కారుకుల సత్యం తమ ఇళ్లలో 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారం మేరకు పోలీసులు ఆదివారం తెల్లవారుజామున దాడి చేశారు. 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ డీటీ సత్యనారాయణకు అప్పగించారు.

థమ్సప్ అనుకుని గడ్డిమందు తాగిన బాలుడు



అంబులెన్స్‌లో తల్లితో వరుణ్‌తేజ

కరకగూడెం: థమ్సప్ అనుకుని ఓ బాలుడు గడ్డిమందు తాగిన ఘటన మండలంలోని చొప్పల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జాడి నవీన్ – వరలక్ష్మి దంపతుల కుమారుడు ఐదేళ్ల వరుణ్‌తేజ ఆదివా రం ఉదయం ఇంట్లో ఆడుకుంటుండగా.. థమ్సప్ బాటిల్‌లో పోసిన గడ్డిమందు కనిపించింది. అయితే దాన్ని థమ్సప్‌గా భావించిన బాలుడు కొంత తాగాడు. కాసేపటికి కడుపునొప్పితో బాధపడడంతో నోరు వెంట నురగలు వస్తూ వాంతి చేసుకున్నాడు. వెంటనే తల్లిదండ్రులు ఆటోలో కరకగూడెం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి 108 ద్వారా మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఖమ్మం తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

పేకాట స్థావరంపై దాడి

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై ప్రత్యేక బృందంతో దాడులు చేపట్టారు. రూ.2,500 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

వసతులు లేని గృహం

నగరంలోని నయాబజార్‌లో ఉన్న బీసీ బాలుర వసతిగృహం అసౌకర్యాలకు నిలయంగా మారింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సీలింగ్ ఊడిపోయింది. కిటికీలకు తలుపులు దెబ్బతిన్నాయి. పురుగులు లోపలికి వస్తుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మెయిన్ తలుపు కూడా లేకపోవడం గమనార్హం. అలాగే, గతేడాది వచ్చిన వరదలు వసతి గృహాన్ని ముంచెత్తాయి. దీని మరమ్మతుల కోసం గత కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ రూ.4 లక్షల వరకు కేటాయించారు. కానీ, పనులు చేయించుకోవడంలో అధికారులు విఫలమయ్యారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్



తలుపులు లేకుండా ఉన్న కిటికీలు



ఊడిపోయిన సీలింగ్



వసతిగృహానికి తలుపు లేని దృశ్యం